
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
బుధవారం 28 ఫిబ్రవరి 2024
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 । కనిష్ఠం : 19.0



ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు
మోగిన నగారా



- ఉమ్మడి పాలమూరులో బీఆర్‌ఎస్‌కే అధిక బలం
- గతంలో ఎమ్మెల్సీ స్థానాలన్నీ ఏకగ్రీవమే
- ప్రభుత్వం మారడంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పోటీ..
- కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి దాదాపు ఖరారు
- బీఆర్‌ఎస్ టిక్కెట్ కోసం మాజీ ఎమ్మెల్యేల ఆసక్తి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం నగారా మోగించింది. ఇక్కడి నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కశిరెడ్డి నారాయణరెడ్డి.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసి గెలుపొందడంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఈ రకంగా ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో స్థానిక సంస్థల కోటా కింద రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఉండగా.. ఒక ఎమ్మెల్సీ స్థానంలో కూచకుళ్ల దామోదర్ రెడ్డి కొనసాగుతున్నారు. అయన బీఆర్‌ఎస్ తరఫున ఏకగ్రీవంగా ఎన్నికైనప్పటికీ.. తర్వాత కాంగ్రెస్‌లో చేరడం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కూడా అధికారంలోకి రావడంతో ఆయన పదవికి వచ్చిన ఢోకా లేదు. ఈ నేపథ్యంలో ఒక్క ఎమ్మెల్సీ స్థానం భర్తీ చేసేందుకు రంగం సిద్ధం కాగా.. గతంలో ఈ రెండు స్థానాలు బీఆర్‌ఎస్ తరఫున ఏకగ్రీవమైనవే.. ఉమ్మడి పాలమూరు జిల్లాలో స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్ సభ్యులే అధికంగా ఉండటంతో గతంలో ఇతర పార్టీలు అభ్యర్థులను కూడా నిలబెట్టలేని పరిస్థితి ఉండేది. అయితే ఇప్పటికీ ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌కే అధిక బలం ఉంది. కొత్తగా గెలిచిన కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం ఇతర పార్టీల నుంచి ప్రజాప్రతినిధులను చేర్చుకోమని, తమ వెంట నడిచిన వారికి ప్రాధాన్యం ఇస్తామనడంతో చాలామంది చేరడానికి సిద్ధంగా ఉన్నా.. చేరికలు జరగడం లేదు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు రావడంతో బలం పెంచుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలపై ఉండనుంది. ఒకవేళ బలం పెంచుకోలేకపోతే.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి చెందడం తథ్యమనే చెప్పవచ్చు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం.. పార్లమెంట్ ఎన్నికలు ముంగిట ఉండటంతో ఈ స్థానాన్ని గెలవడం పార్టీకి చాలా ముఖ్యం.. ఒకవేళ బలం లేదని అభ్యర్థిని నిలపకపోయినా.. లేదా నిలిపి ఓటమి చెందినా.. దాని ప్రభావం పార్లమెంట్ ఎన్నికలపై పడే అవకాశం ఉంటుంది. వాస్తవానికి స్థానిక సంస్థల్లో భాగమైన ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం జూన్‌తో ముగుస్తుంది. కౌన్సిలర్ల పదవీ కాలం మరో ఎనిమిది నెలలు ఉంటుంది. ఈ నేపథ్యంలోనే త్వరితగతిన ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తి చేసేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది.

ఎమ్మెల్సీపై చాలామందిలో ఆశలు..



మన్నె జీవన్‌రెడ్డి

రెండు పర్యాయాలుగా ఈ ఎమ్మెల్సీ స్థానాలు ఏకగ్రీవమవుతున్నాయి. స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్ సభ్యులు అధికంగా ఉండటం వల్ల పార్టీ ఎవరికి టిక్కెట్ ఇస్తే వారే గెలిచే పరిస్థితులు ఉండేవి. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతోపాటు.. చాలామంది స్థానిక సంస్థల సభ్యులు కాంగ్రెస్‌వైపు మొగ్గుచూపు తుండటంతో ఆ పార్టీ తమ అభ్యర్థిని నిలపనుంది. ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆయన ఎంపీ టికెట్ ఆశిస్తున్నారని ప్రచారం జరిగినప్పటికీ.. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా చల్లా వంశీ చంద్‌రెడ్డి పేరును ఖరారు చేయగా.. పార్టీలో చేరిక సమయంలోనే అధిష్ఠానం జీవన్ రెడ్డికి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవిని ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది. ఇక బీఆర్‌ఎస్ నుంచి చాలామంది ఆశావహులు ఎమ్మెల్సీ టికెట్ రేసులో ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి పోటీ చేయించేందుకు పలువురు మాజీ ఎమ్మెల్యేలకు పార్టీ సూచించినా.. వారు పోటీకి వెనకడుగు వేస్తున్న పరిస్థితుల్లో ప్రస్తుత ఎంపీకే టికెట్ దక్కే అవకాశాలు ఉన్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో మాత్రం చాలామంది మాజీ ఎమ్మెల్యేలు పోటీకి ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్ బలం అధికంగా ఉండడమే అని చెప్పవచ్చు. ఇప్పటివరకు బహిరంగంగా ఎవరూ ప్రకటించకపోయినప్పటికీ.. మాజీ ఎమ్మెల్యేల అనుచరులు సోషల్ మీడియాలో తమ నాయకుడే పోటీచేస్తారనే సందేశాలు పెడుతున్నారు.

అధికబలం బీఆర్‌ఎస్‌కే...

ఉమ్మడి పాలమూరులో అయిదు జిల్లాలు ఉండగా.. మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో 14 మండలాల చొప్పున, గద్వాల జిల్లాలో 12 మండలాలు, నాగర్‌కర్నూలు జిల్లాలో 20 మండలాలు, నారాయణపేట జిల్లాల్లో 11 మండలాలు ఉన్నాయి. ఇందులో కొత్తగా కొన్ని మండలాలు ఏర్పడినా.. ఇంకా పాత మండలాల వారీగానే స్థానిక సంస్థలు కొనసాగుతున్నాయి. అలాగే ఉమ్మడి పాలమూరులో 19 మునిసిపాలిటీలు ఉన్నాయి. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో 95శాతం కంటే ఎక్కువగా బీఆర్‌ఎస్ మద్దతుతో పోటీచేసిన అభ్యర్థులే గెలిచారు. కొందరు అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరగా.. కొన్ని స్థానాలకు రాజీనామా, కొందరు చనిపోవడంతో ఖాళీ స్థానాలు ఉన్నాయి. అయినప్పటికీ స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్ బలమే ఎక్కువగా ఉంది. దాదాపు 70శాతం పైగా ఇంకా బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారు. మొన్నటివరకు పార్టీలో చేరడానికి స్థానిక సంస్థల సభ్యులు క్యూ కడితే ఎమ్మెల్యేలు, వారి అనుచరులు తిరస్కరించగా.. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వారి వద్దకు కాంగ్రెస్ నేతలు క్యూ కట్టే పరిస్థితులు ఏర్పడబోతున్నాయి. ఇప్పుడు వారిని పార్టీలోకి తీసుకువచ్చి.. బలం పెంచుకోవడం ఎమ్మెల్యేలపై భారం కానుంది.

జిల్లాల వారీగా ఓట్లు.. పార్టీల వారి బలం

జిల్లా	మొత్తం ఓట్లు	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	ఇతరులు
గద్వాల	209	157	34	18
మహబూబ్‌నగర్	268	188	67	13
నారాయణపేట	208	120	37	51
వనపర్తి	218	151	51	16
నాగర్‌కర్నూలు	357	209	138	10
మొత్తం	1260	825	327	108

ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదల : కలెక్టర్

మహబూబ్‌నగర్(కలెక్టరేట్): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసన మండలి స్థానానికి ఉప ఎన్నిక మార్చి 28న నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) సోమవారం షెడ్యూల్ విడుదల చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ మార్చి 4వ తేదీన ఎన్నికల సంఘం విడుదల చేసిందని తెలిపారు. షెడ్యూల్ విడుదలతో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి పరిధిలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఎన్నికల కోడ్ తక్షణం అమలులోకి వచ్చిందని ఆయన తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మార్చి 4వ తేదీన నోటిఫికేషన్ జారీ, నామినేషన్లకు తుది గడువు మార్చి 11, మార్చి 12న నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణకు మార్చి 14 తుది గడువు, మార్చి 28 ఉదయం 8 గంటల నుంచి సాయంత్ర 4 గంటల వరకు పోలింగ్, ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు, ఏప్రిల్ 4తో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని ఆయన తెలిపారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైక్ అనుమతులు, వాహన అనుమతులను ఆయా జిల్లాల కలెక్టర్ల నుంచి పొందాలని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు
సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం కానున్న పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 120 పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 65,098 మంది విద్యార్థులు
- పరీక్షా కేంద్రానికి అర్ధగంట ముందే చేరుకోవాలి
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు



నాగర్‌కర్నూల్‌లో ఇంటర్ పరీక్షల ఏర్పాట్లును పరిశీలిస్తున్న నోడల్ అధికారి వెంకటరమణ

మహబూబ్‌నగర్, విద్యావిభాగం ఫిబ్రవరి 27 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి ఇందుకు సంబంధించి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ పరీక్షలకు సంబంధించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 120 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 65,098 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పాలమూరు జిల్లా వ్యాప్తంగా మొత్తం 33 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 21,930 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మొదటి సంవత్సరానికి సంబంధించి 10,976 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 10,954 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 12,457 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 8,273 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 32 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 13,871 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 8,567 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించారు. విద్యార్థులు అర్ధగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించేది లేదని తెలిపారు. ఈ విషయాన్ని గుర్తుంచుకొని విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్‌లను మూసి ఉంచాలని ఆదేశించారు.

సీసీ కెమెరా నిఘాలో పరీక్ష కేంద్రాలు..

జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలలో ఇంటర్ బోర్డు అధికారుల ఆదేశాల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష రాసే విద్యార్థులు ఇబ్బంది పడకుండా పరీక్ష కేంద్రం వద్ద తాగునీరు, వైద్యం వసతులు కల్పించారు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

ఇంటర్ పరీక్షల్లో కాపీ కొడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. పరీక్షా నిర్వహణకు సంబంధించి మంగళవారం డీఐఈవో స్క్వాడ్ బృందాలతో, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి సూచనలు చేశారు. స్క్వాడ్ బృందాలు పరీక్షా కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులు ఎవరైనా కాపీయింగ్‌కు పాల్పడితే బోర్డు ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌తో ఊరట

- లబ్ధిపొందనున్న 2.5 లక్షల మంది
- పాలమూరు.. వనపర్తిలలోనే అత్యధికం
- ఉమ్మడి జిల్లాలో సమకూరనున్న రూ.300 కోట్ల ఆదాయం
- ఆనందంలో లబ్ధిదారులు
- నాలుగేళ్ల నిరీక్షణకు తెర తీసిన కాంగ్రెస్ ప్రభుత్వం



పాలమూరు పురపాలిక కార్యాలయం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27: ప్రభుత్వం ఎట్టకేలకు ఎల్‌ఆర్‌ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)కు పచ్చజెండా ఊపింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అనుమతిలేని లేఅవుట్‌లను క్రమబద్ధీకరించేందుకు 2020 ఆగస్టులో నాటి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పథకం కోసం దరఖాస్తులు స్వీకరించింది. అప్పట్లో రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నిబంధనల మేరకే ఫీజు చెల్లించాలని నిర్ణయించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాలలో ఉన్న మార్కెట్ విలువ ఆధారంగా ఫీజు నిర్ణయించనున్నారు. ఇలా ఉమ్మడి పాలమూరులోని 19 మునిసిపాలిటీలలో 1,94,493 మంది తమ అసెస్‌మెంట్‌లకు సంబంధించిన వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకోగా, గ్రామ పంచాయతీలలోని ప్లాట్లకు సంబంధించి మరో 50-60 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం ఇప్పటివరకు ప్లాట్ సైజుల ప్రకారం ఫీజు కట్టించుకోలేదు. దీనికోసం నాలుగేళ్లుగా లబ్ధిదారులు ఎదురుచూస్తునే ఉన్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం మార్చి 31 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఇవ్వడంతో దరఖాస్తు చేసుకునే వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు పెద్దఎత్తున ఆదాయం సమకూరనుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌ల రూపంలో రూ.300-400 కోట్ల ఆదాయం సమకూరనుంది. కాగా ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ల విషయంలో దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలున్న భూములు తప్పా ఇతర లేఅవుట్‌లను క్రమబద్ధీకరించాలని నిర్ణయించడంతో దరఖాస్తు చేసుకున్నవాటిలో కొన్ని రిజెక్ట్ అయ్యే అవకాశం ఉంది.

పురపాలికల్లో దరఖాస్తులు ఇలా...

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మునిసిపాలిటీలో పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా మహబూబ్‌నగర్, వనపర్తి మునిసిపాలిటీలలో దరఖాస్తులు వచ్చాయి. మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో 31,144 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కొన్ని వివాదంలో ఉన్న ప్లాట్ల స్థలాలు కూడా ఉన్నాయి. అధికారులు వీటిపై విచారణ చేసి క్రమబద్ధీరణ చేయాల్సి ఉంది.

వనపర్తి మునిసిపాలిటీలో 28,941 దరఖాస్తులు వచ్చాయి. అచ్చంపేటలో 11,971, అలంపూర్‌లో 425, ఆత్మకూర్‌లో 3,788, జడ్చర్లలో 17,564, భూత్పూర్‌లో 5,999, గద్వాలలో 14,317, అయిజలో 9,767, కల్వకుర్తిలో 11,443, కొల్లాపూర్‌లో 4,565, కోస్గిలో 3,909, కొత్తకోటలో 7,539, మక్తల్‌లో 10,498, నాగర్‌కర్నూల్‌లో 16,011, నారాయణపేటలో 6,962, పెబ్బేరులో 7,282, మరచింతలో 438, వడ్డెపల్లిలో 1,930 దరఖాస్తులు వచ్చాయి. అదేవిధంగా లే అవుట్‌లకు పలు దరఖాస్తులు వచ్చాయి. నారాయణపేటలో లే అవుట్‌ల కోసం 45, మక్తల్ లో 29, కోస్గిలో 35, వనపర్తిలో 42, పెబ్బేరులో 45, ఆత్మకూరులో 24, అమరచింతలో 4, కొత్తకోటలో 41, అయిజలో 10 దరఖాస్తులు వచ్చాయి.

సమకూరనున్న ఆదాయం..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులన్నీ క్రమబద్ధీకరిస్తే మునిసిపాలిటీలకు ఆదాయం సమకూరనుంది. చాలా మునిసిపాలిటీలలో నిధులు లేక కనీస వసతులు కల్పించలేని పరిస్థితిలో ఉన్నాయి. ఇప్పుడు ఈ నిధులతో మునిసిపాలిటీల ఖజానా కళకళలాడనుంది. అయితే ఈ ఫీజులు నేరుగా మునిసిపాలిటీలకు జమ అవుతాయా..? ప్రభుత్వ ఖజానాకు వెళ్తాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పురపాలకులు మాత్రం నేరుగా మునిసిపాలిటీల ఖాతాలలో జమచేస్తే మౌలిక వసతులకు ఉపయోగిస్తామని చెబుతున్నారు.

కాసులు కురిపిస్తున్న పొగాకు

- క్వింటా పొగాకుకు రూ.15 వేలు - లాభసాటిగా మారిన సాగు - సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు



ఇటిక్యాలలో పొగాకును ఆరబెట్టిన రైతులు

ఇటిక్యాల, ఫిబ్రవరి 27: వాణిజ్య పంట అయిన పొగాకు సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. వాణిజ్య పంటలపై రైతులు ఆసక్తి చూపుతుండడంతో ప్రతీ ఏటా సాగు పెరుగుతోంది. నాలుగు సంవత్సరాల నుంచి రైతులు మిరప, పత్తి, పప్పుశనగ పంటల సాగుపై ఆసక్తి చూపారు. గతేడాది నుంచి పత్తి, మిరప పంటలు దిగుబడి తగ్గుతుండడంతో ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా రైతులు పొగాకు పంట సాగుపై అసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఈ ఏడాది రైతులకు పొగాకు పంట కాసులు కురిపిస్తుంది. గద్వాల, అలంపూరు నియోజకవర్గంలో పొగాకు పంటను అధికంగా సాగు చేశారు. ఇటిక్యాల 118 ఎకరాలు, ఉండవెల్లిలో 165, మానవపాడులో 344, అలంపూరు 1,080, ధరూర్‌లో 86, గట్టులో 361, కేటీదొడ్డిలో 180, మల్దకల్‌లో 265చ అయిజలో 7 ఎకరాల విస్తీర్ణంలో సాగుచేశారు. అధికంగా నల్లరేగడి భూములు ఉండటంతో రైతులు ఈ ఏడాది 3,000 ఎకరాలకు పైగా పొగాకు పంట సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. పంట సాగులో పెట్టుబడి ఖర్చు పెద్దగా ఉండదని ఎకరాకు రూ.80 వేలకు పైగా లాభం వస్తుందని రైతులు తెలిపారు.

కష్టానికి తగిన ఫలితం ఉంది



ఈ సారి మూడు ఎకరాలలో పొగాకు పంట సాగు చేశాను. ఎకరాకు ఎనిమిది క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. కష్టానికి తగిన ఫలితం దక్కింది. ప్రతీ ఏటా మిరప, పత్తి పంట సాగు చేస్తే విక్రయించేందుకు ఇబ్బంది ఉండేది. పొగాకు పంట సాగు చేయడంతో ప్రవేటు కంపెనీ వారు గ్రామానికే వచ్చి పంట కొనుగోలు చేస్తున్నారు. ధర కూడా బాగానే ఉంది.

\- నాగరాజు, రైతు ఉదండాపురం

ప్రకృతి అనుకూలించింది



నాలుగేళ్ల నుంచి పత్తి, మిరప పంట సాగు చేసి నష్టపోయాం. ఈ ఏడాది పొగాకు పంట రెండు ఎకరాలలో సాగు చేశాను. ప్రకృతి అనుకూలించడంతో దిగుబడి బాగానే వచ్చింది. గతంలో పంటను మండెలుగా పెట్టి విక్రయించేందుకు వ్యాపారుల కోసం ఎదురు చూసే వాళ్లం. ఇప్పుడు కంపెనీ వారే గ్రామానికి వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

\- దావీదు, రైతు ఇటిక్యాల

గంగమ్మ లోలోపలికి..

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- జిల్లాలో సగటు లభ్యత లోతు 8.64 మీటర్లు

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి27: నాగర్‌కర్నూల్ జిల్లాలో భూగర్భ జలాలు రోజు రోజుకూ అడుగంటుతున్నాయి. గత ఏడాదితో పోల్చితే ఈ సారి జిల్లాలోని అన్ని మండలాల్లో భూగర్భ జలాలు లోతుకు పడిపోయాయి. జిల్లాలో గత ఏడాది జనవరిలో 5.07 మీటర్ల సగటు లోతులో లభించిన భూగర్భ జలాలు 3.57 మీటర్ల పడిపోయి ప్రస్తుతం 8.64 మీటర్ల లోతులో లభిస్తున్నాయి. జిల్లాలోని దాదాపు తొమ్మిది మండలాల్లో భూగర్భ జలాలు 10 మీటర్ల లోపలే లభిస్తుండగా నాగర్‌కర్నూల్ మండలంలో అత్యధికంగా 14.33 మీటర్ల లోతులో లభిస్తున్నాయి. వేసవి కాలం రాక ముందే జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి ఇలా ఉంటే ఇక మే నాటికీ భూగర్భ జలాలు ఏ స్థాయిలో అడుగంటుతాయోనని ఆందోళన కలిగిస్తోంది.

● పదరలో 12.34 మీటర్లు..

ఏడాది కాలంగా జిల్లాలోని పదర మండలంలో అత్యధికంగా 12.34 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. అదేవిధంగా అమ్రాబాదులో 10.87, ఉప్పునుంతలలో 10.62, తిమ్మాజిపేటలో 9.24, అచ్చంపేటలో 7.44, కల్వకుర్తిలో 6.68, వెల్దండలో 6.34 మీటర్లు మేరకు భూగర్భ జలాలు పడిపోయాయి. అయితే ఆయా మండలాల్లో సాధారణం కంటే 30 శాతం లోటు వర్షం కురువడం గమనార్హం. జిల్లా సాధారణ వార్షిక వర్షపాతం 642.3 మిల్లీ మీటర్లు కాగా జనవరి నాటికి 595.9 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా కేవలం 442.1 మిల్లీ మీటర్ల వర్షమే కురిసింది. దీంతో వర్షాకాలంలో సైతం ఆరుతడి పంటలకు రైతులు బోరుబావులు ఉపయోగించక తప్పలేదు. దీని ప్రభావం భూగర్భ జలాలపై పడి గత ఏడాది కంటే ఈ సారి జనవరి నాటికే భూగర్భ జలాలు వేగంగా అడుగంటాయి.



పెద్దకొత్తపల్లి మండలం దేవుని తిర్మలాపూర్‌లో భూగర్భ జలాలను పంపింగ్ చేస్తున్న బోరు మోటారు

భూగర్భ జలాలను పొదుపుగా వాడాలి



ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిసిన నేపథ్యంలో భూగర్భ జలాలు గతం కంటే కాస్త తగ్గాయి. భూగర్భ జలాలను వృథా చేయకుండా అవసరం మేరకే వినియోగించుకోవాలి. ఇంకుడు గుంతలు ఉపయోగించి భూగర్భ జలాలను సంరక్షించుకోవాలి.

\- రమాదేవి, జిల్లా భూగర్భజలశాఖ అధికారి, నాగర్‌కర్నూల్

ఆవిష్కరణలకు వర్సిటీలు వేదికలవ్వాలి

- ఐఐసీటీ, డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి
- పీయూలో ప్రారంభమైన రెండు రోజుల సదస్సు

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 27 : కొత్త ఆవిష్కరణలకు యూనివర్సిటీలు వేదికలవ్వాలని, ఆ దిశగా అధ్యాపకులు, విద్యార్థులు కృషి చేయాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం పీయూలోని లైబ్రరీ సెమినార్ హాల్‌లో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రి విభాగం ఆధ్వర్యంలో 'కెమిస్ట్రీ ఫర్ ఏ సస్టెనబుల్ ఫ్యూచర్' అనే అంశంపై నిర్వహించే రెండు రోజుల జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. అంతకుముందు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్, ఐఐసీటీ, డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, ఈసీ మెంబర్‌తో కలిసి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. మానవాళి సుస్థిర అభివృద్ధిలో కెమిస్ట్రీ పాత్ర కీలకమైనదని అన్నారు. యూనివర్సిటీలో పరిశోధన కేంద్రాన్ని నిర్మిస్తున్నామని వీసీ తెలిపారు. రెండవ సెషన్‌లో ముఖ్యవక్తగా వచ్చిన ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో ఫెలోషిప్‌లు ఇస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. దేశంలో 37 రీసెర్చ్ సెంటర్లు ఉన్నాయని, ముఖ్యంగా స్త్రీలు పరిశోధనలపై మక్కువ చూపడం లేదని, ఆ దిశగా అందరూ ఆలోచించాలని అన్నారు. మందులు 80% నుంచి ప్రకృతి నుంచి పొందుతున్నామని వెహికల్, ఎలక్ట్రానిక్స్, గృహ నిర్మాణ రంగంలో కెమిస్ట్రీ ముఖ్యపాత్ర వహిస్తోందని, కెమిస్ట్రీ అన్ని సబ్జెక్టులకు అనుసంధానంగా ఉటుందని అన్నారు. మానవాళికి దోమల వల్ల తీవ్ర ముప్పు ఉందని, వాటి నివారణ కోసం పరిశోధనలు జరుగుతున్నాయని అన్నారు. ఐఐసీటీలలో పీహెచ్‌డీ చేయడానికి సెట్ నెట్ జేఆర్ఎఫ్‌లలో అర్హతలతో పాటు ఆసక్తికూడా ఉండాలని, అప్పుడే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, చైర్మన్ డాక్టర్ చంద్రకిరణ్, ఈసీ మెంబర్ డాక్టర్ నూర్జహాన్, ప్రొఫెసర్ మనోహర్, కన్వీనర్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ నాగయ్య, రాజేందర్ రెడ్డి, కో కన్వీనర్ డాక్టర్ రామ్మోహన్, పీఆర్ఓ డాక్టర్ ఎస్. రవి కుమార్, అధ్యాపకులు అయేషాహష్మి, బి.సిద్దారమాగౌడ్, డాక్టర్ రూపవాణి, డాక్టర్ రామరాజు, డాక్టర్ బేబి లత, డాక్టర్ దీప్తిరెడ్డి, స్కాలర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.



డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న పీయూ వీసీ, అధికారులు

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసు నమోదు

కొత్తకోట, ఫిబ్రవరి 27 : గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసు నమోదు చేసినట్లు కొత్తకోట ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఈనెల 23వ తేదీన వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలో ఛత్రపతి శివాజీమహరాజ్ విగ్రహా ఆవిష్కరణ సభలో ముస్లిం మనోభావాలు దెబ్బతినే విధంగా రాజాసింగ్ ప్రసంగం చేశారని పట్టణానికి చెందిన పలువురు ముస్లింలు ఫిర్యాదు చేయడంతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తెలంగాణలో 17 సీట్లు బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

» విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

» ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి

» తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?

» ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం

» ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు.ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగునీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండద మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్‌ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్‌ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తల్లిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

» హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?

» నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం

» కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?

» కేటీఆర్‌తో బీఆర్‌ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరి తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కారహీనుడిని కానని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్‌ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

» నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

» ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి

» సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెరలేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.

బీఆర్‌ఎస్‌తో కలిసే ప్రసక్తే లేదు

» బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు పాలమూరు జిల్లా ప్రజలకు ఏం చేశాయి

» యూపీఏ పాలనలో కుంభకోణాలు, అంతా అవినీతిమయం

» బీజేపీ విజయ సంకల్పయాత్రతో తెలంగాణలో 17ఎంపీ స్థానాలు కైవసం చేసుకుంటాం

» రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే.లక్ష్మణ్ వెల్లడి



కొల్లాపూర్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే.లక్ష్మణ్

కొల్లాపూర్, ఫిబ్రవరి 27 : తెలంగాణ రాష్ట్రంలో ఏ ఎన్నికల్లో కూడా బీజేపీ బీఆర్‌ఎస్‌తో కలిసి పని చేసే ప్రసక్తే లేదని బీఆర్‌ఎస్ మునిగిపోయిన పడవ అని, కాంగ్రెస్ మునిగిపోతున్న పడవ అంటూ, రాబోయే రోజుల్లో వికసించేది కమలమేనని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే.లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీ నిర్వహిస్తున్న విజయ సంకల్పయాత్రను మంగళవారం కొల్లాపూర్ బీజేపీ కార్యాలయం నుంచి డాక్టర్ కే.లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు లతో కలిసి డాక్టర్ కే.లక్ష్మణ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు పాలమూరు జిల్లా ప్రజలకు చేసిందేమిటో నిరూపించాలని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల పాలనలో పాలమూరు జిల్లా ఇంకా ఎడారిగానే కన్పిస్తుందని లక్ష్మణ్ ధ్వజమెత్తారు. పదేళ్ల యూపీఏ పాలనలో కుంభకోణాలు, అవినీతిమయమైన పాలన కొనసాగిందని మోదీ సర్కార్ వచ్చాక ఒక్క అవినీతి మచ్చ లేకుండా ప్రపంచ దేశాల అధినేతలు మెచ్చేలా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఎన్ని పార్టీలు ఏకమైన దేశప్రజలు మోదీ వైపే ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ అవినీతి, కుటుంబ పాలన చేస్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల వైఖరిని ప్రజల ముందు ఉంచుతామని వచ్చే ఎంపీ ఎన్నికల్లో 17స్థానాల్లో బీజేపీ జెండా ఎగురవేస్తుందని మూడవసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని లక్ష్మణ్ జోస్యం చెప్పారు.

సమావేశంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, విజయ సంకల్ప యాత్ర ప్రముఖ్ శ్రీవర్ధన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అయ్యంగారి ప్రభాకర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర నాయకులు తమటం శేఖర్‌గౌడ్, జిల్లా నాయకులు నందు రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు తమటం సాయికృష్ణగౌడ్, అన్వేష్, ప్రసాద్, పుల్లయ్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మూలే భరత్‌చంద్ర, బీజేవైఎం జిల్లా కార్యదర్శి కాశిపురం మహేష్ పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం

పెద్దకొత్తపల్లి/లింగాల/అచ్చంపేటటౌన్ : దేశం అభివృద్ధి చెందాలంటే ప్రధాని మోదీతోనే సాధ్యమవుతుందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం బీజేపీ విజయ సంకల్ప యాత్ర దేవునితిర్మలాపూర్ మీదుగా పెద్దకొత్తపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ బస్టాండ్ చౌరస్తాలో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు ఉన్నారు. అలాగే పెద్దకొత్తపల్లి మండలం నుంచి లింగాలకు విజయ సంకల్ప యాత్ర చేరుకోగా మండల బీజేపీ శాఖ ఘనంగా స్వాగతం పలికింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్రంలో మూడో సారీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

అచ్చంపేట పట్టణానికి చేరుకున్న విజయ సంకల్ప యాత్ర అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ మాట్లాడారు. ప్రపంచ దేశాలు మన దేశం వైపు చూస్తున్నాయి అది మోదీ చేసిన అభివృద్ధేనని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే ఒరిగేది ఏమి లేదన్నారు. బీఆర్‌ఎస్‌కు భవిష్యత్ లేదన్నారు. అనంతరం కామారెడ్డి వెంకటరమణ రెడ్డి, నాయకులు బంగారు శ్రుతి, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఆచారి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జాతీయ జట్టుకు ఎంపికవ్వాలి

- డీఈఓ రవీందర్ - రెండవ రోజు కొనసాగిన అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్

జడ్చర్ల, ఫిబ్రవరి 27: జాతీయ జట్టుకు ఎంపికయ్యే విధంగా ప్రతీ క్రీడాకారుడు తన ప్రతిభను కనబరచాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ సూచించారు. మంగళవారం జడ్చర్ల మినీస్టేడియంలో జరుగుతున్న అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ రెండవరోజు కొనసాగింది. టోర్నమెంట్‌లో ఆడుతున్న క్రీడాకారులను పరిచయం చేసుకుని, జరిగిన మ్యాచ్‌లలో ఎవరెవరు గెలిచారో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకాగ్రతతో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. విజయాల పరంపర కొనసాగిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా జట్టు సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. అండర్-14 బాలుర విభాగంలో జరుగుతున్న టోర్నమెంట్ రెండవరోజు మెదక్ జిల్లా జట్టు, ఆదిలాబాద్ జిల్లా జట్టు తలపడగా 8 వికెట్ల తేడాతో ఆదిలాబాద్ జిల్లా జట్టు గెలిచింది. హైదరాబాద్, నల్గొండ జిల్లాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 61 పరుగుల తేడాతో హైదరాబాద్ జట్టు విజయం సాధిం చింది. మెదక్, ఖమ్మం జిల్లా జట్ల మధ్య జరిగిన పోరులో 27 పరుగుల తేడాతో ఖమ్మం గెలిచింది. నల్గొండ జిల్లా జట్టు, మహబూబ్‌నగర్ జిల్లా జట్టు మధ్య జరిగిన పోరులో 10వికెట్ల తేడాతో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లను జడ్చర్ల పట్టణంలోని మినీస్టేడియంలో మ్యాట్ పిచ్‌పై, అలాగే గంగాపురం వెళ్లే దారిలోని ప్రైవేట్ స్థలంలో టర్ఫ్ పిచ్‌లపై నిర్వాహకులు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంవో బాలుయాదవ్, పరిశీలకులు విద్యాసాగర్, ఎస్జీఎఫ్ సభ్యులు రమేశ్‌బాబు, వేణుగోపాల్, శారదాబాయి, ఆనంద్‌కుమార్, బాలరాజయ్య, ఉమాదేవి, భానుకిరణ్, రామకృష్ణ, రాములు, శంకర్, రవి, శ్రీను, పీఈటీలు మోయిన్, కిట్టు పాల్గొన్నారు.



జడ్చర్లలో మినీస్టేడియంలో క్రికెట్ టోర్నమెంట్‌లో తలపడిన జట్లు

నిజాయతీ చాటుకున్న పెయింటర్

- గంగాపురం సమీపంలో దొరికిన బ్యాగును పోలీసులకు అప్పగింత



దొరికిన బ్యాగును జడ్చర్ల సీఐకి అప్పగిస్తున్న పెయింటర్ వెంకటేశ్

జడ్చర్ల, ఫిబ్రవరి 27 : జడ్చర్ల మండలం లింగంపేట గ్రామానికి చెందిన పెయింటర్ జంగాల వెంకటేష్ నిజాయతీ చాటుకున్నాడు. దారిలో వస్తుండగా దొరికిన బ్యాగును నిజాయతీగా మంగళవారం జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో సీఐ ఆదిరెడ్డికి అందచేశాడు. అందుకు సంబంధించి జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ప్రతీ రోజు లింగంపేట నుంచి జడ్చర్లకు వెంకటేశ్ పెయింటర్ వృత్తిరీత్యా ద్విచక్రవాహనంపై వస్తుంటాడు. సోమవారం సాయంత్రం జడ్చర్ల నుంచి లింగంపేటకు వెళ్తుండగా గంగాపురం సమీపంలో రోడ్డు పక్కన పడి ఉన్న బ్యాగును గమనించాడు. వెంటనే ఆ బ్యాగు ఎవరిదనే ఆచూకీ కోసం ప్రయత్నించాడు. బ్యాగులో కొంత నగదు, విలువైన వస్తువులు ఉండడంతో వెంటనే జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చి, దొరికిన బ్యాగును సీఐ ఆదిరెడ్డికి అప్పగించాడు. నిజాయతీగా బ్యాగును అప్పగించిన సదరు వెంకటేశ్‌ను సీఐ అభినందించారు. జడ్చర్ల నుంచి కల్వకుర్తి వెళ్లే దారిలో గంగాపురం సమీపంలో ఎవరైనా బ్యాగును పోగొట్టుకున్న వాళ్లు ఆధారాలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చి తీసుకెళ్లాలని సీఐ తెలిపారు.

వంట గ్యాస్ సిలిండర్‌కు మంటలు

- ఇద్దరు మహిళలకు గాయాలు - కట్టు బట్టలతో బయట పడ్డ కుటుంబం

- బాధితులను పరామర్శించిన జడ్పీ చైర్‌పర్సన్

గట్టు, ఫిబ్రవరి 27 : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని తప్పెట్లమోర్సు గ్రామంలో ప్రమాదవశాత్తు వంట గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటు కొని ఇద్దరు మహిళలు గాయపడ్డారు. సిలిండర్ పేలక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయ్యింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తలారి బజారన్న ఇంట్లో వంట చేస్తుండగా సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న తలారి పార్వతమ్మ, గుంజపల్లి భాగ్యమ్మలకు గాయాలయ్యాయి. వారు అప్రమత్తమై వెంటనే బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పేశారు. కానీ అప్పటికే ఇంట్లోని వస్తువులు, దుస్తులు, వంటసామగ్రి పూర్తి కాలి బూడిదయ్యింది. విషయం తెలియడంతో తహసీల్దార్ సరితారాణి అక్కడికి చేరుకుని నష్టాన్ని అంచనా వేశారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జడ్పీచైర్‌పర్సన్ సరిత

బాధితులను ఆదుకుంటాం

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని జడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. సిలిండర్‌కు మంటలు అంటుకొని గాయపడిన వారిని ఆమె పరామర్శించి, సంఘటన వివరాలను తెలుసుకున్నారు. ప్రాణపాయం జరగక పోవడం అదృష్టమన్నారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు నర్సింహులు, రంగస్వామిగౌడ్, ముక్కెరన్న, బజారన్న, ఆంజనేయులుగౌడు ఉన్నారు.


స్వయం కృషితో ఈత వనం

- స్వచ్ఛమైన నీరాతో ఉపాధి

- కల్తీకి చెక్‌పెడుతూ యువ రైతు రవిగౌడ్ కృషి

- 1500 ఈత వనాలతో నీరా

కల్లు అనగానే... అది మందు కలిపిందే అని అందరి మెదళ్లలోకి వచ్చే ఆలోచన. ఇక్కడ ఓ గౌడన్న మాత్రం పదిహేను వందల ఈత చెట్లను పెంచి, స్వచ్ఛమైన నీరా, కల్లును తయారు చేస్తున్నాడు. ప్రజలకు ఆరోగ్యం పంచుతూ, తనూ నాలుగు రూపాయలు సంపాదిస్తున్నాడు.



ఈత చెట్టుకు నీర కోసం కట్టిన లొట్లు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 27 : మండలంలోని యన్మనగండ్ల గ్రామానికి చెందిన గుండపోళ్ల రవీందర్ గౌడ్ తన వ్యవసాయ పొలంలో పంటకు సరైన నీరు లేకపోవడంతో తన సహ రైతుల ఆలోచనతో ఐదేళ్ల క్రితం సుమారు 1500ల ఈత మొక్కలను నాటాడు. ప్రస్తుతం అవి నీరా ఇచ్చే దశకు పెరిగాయి. దీంతో మరో ఇద్దరిని పెట్టుకుని చెట్లనుంచి నీర తీస్తున్నాడు.

నీరాకు భలే డిమాండ్

ప్రస్తుతం ఎక్కడ చూసినా విలువైన మద్యం విక్రయాలు అధికమయ్యాయి. ఊరూరా బెల్టు షాపులు ఉన్నాయి. కల్తీ కల్లుకు చెక్ పెడుతూ తన పొలంలోని ఈత వనాల ద్వారా వస్తున్న నీరా తన పొలంలో పెట్టుకుని విక్రయిస్తున్నాడు. ఈ నీరా సేవించడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండవని, ముఖ్యంగా కిడ్నీ బాధితులకు ఇది ఎంతగానో ఉపయోగ పడుతుందట. ఎక్కుమంది దూర ప్రాంతాల నుంచి వచ్చి నీరాను కొనుగోలు చేస్తున్నారట. ఆది, మంగళ, గురు, శుక్ర తదితర వారాల్లో నీరాకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది.

సాధ్యమైనంత వరకు మంచి నీరా అందిస్తా



ఈత వనాలు లేక గ్రామంలో నాణ్యమైన నీరా దొరకడం గగనంగా మారింది. నీరు తక్కువగా ఉన్న పొలంలో మా కుటుంబ సభ్యుల సహకారంతో ఈత వనాలు పెంచాలని నిర్ణయించుకుని ఐదేళ్లు కష్టపడి వనాలు పెంచాం. నేడు అవి ఫలితాన్నిస్తున్నాయి. మద్యం ప్రియులకు మంచి నీరా అందిస్తా. మున్ముందు పొలంలో మరిన్ని ఈత వనాలు పెంచుతా.

- రవిగౌడ్, యన్మనగండ్ల

భోజన వసతి కల్పించాలి



పీజీ కళాశాల ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 27 : కొల్లాపూర్ పీజీ సెంటర్ హాస్టల్‌లో భోజన వసతి కల్పించాలని బీఆర్‌ఎస్‌వీ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు డి.శేఖర్ డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్‌వీ, ఎస్‌ఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పీజీ సెంటర్ ముందు విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు డి.శేఖర్, ఎస్‌ఎస్‌యూ విద్యార్థి జిల్లా నాయకుడు బి.దాస్ మాట్లాడుతూ దూరప్రాంతాల నుంచి వచ్చి విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల కొరత ఉందని, వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో పీజీ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సింగోటం ఆలయంలో కాంగ్రెస్ నాయకుల పూజలు

కొల్లాపూర్, ఫిబ్రవరి 27 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ మల్లు రవిని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించాలని కోరుతూ కొల్లాపూర్ కాంగ్రెస్ నా యకులు సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు, కొల్లాపూర్ ఏబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకునమోని రాముయాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మీనుగ పరశురామ్‌నాయుడు, పట్టణ అధ్యక్షుడు కాంతారావు, నాయకులు నడిమింటి వెంకటస్వామి, నరసింహ, చంద్రయ్య, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

సేవలను అధిష్ఠానం గుర్తించాలి

- కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ బహుదూర్

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 27 : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేసి పార్టీ బలోపేతానికి అందించిన సేవలను అధిష్ఠానం గుర్తించి మల్లురవికే నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ కేటాయించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌బహదూర్ అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మాట్లాడారు. కార్యకర్తలకు అండగా ఉంటూ పిలిస్తే పలికే మల్లురవికే టికెట్ కేటాయించడం ద్వారా గెలుపు ఖాయం అన్నారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మాధవులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉస్మాన్, లక్ష్మీనారాయణ, మల్లేష్‌ముదిరాజ్, రాఘవేందర్, రమణ, వెంకటేశ్, బద్దు రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

'అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి'

కోడేరు, ఫిబ్రవరి 27 : అర్హులైన వాళ్లందరికీ తెల్లరేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి పి.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సభ్యుడు రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.నరసింహ మాట్లాడుతూ అర్హులైన వాళ్లందరికీ రేషన్‌కార్డులు జారీ చేసి సంక్షేమ పథకాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కమిటీ తీర్మానం చేసిందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు ఎండి.మాలిక్, వెంకటమ్మ, పి.రవి, నాయకులు శివశంకర్, వరప్రసాద్, మరాఠి వెంకటయ్య పాల్గొన్నారు.

చెంచులకు పుట్టీలు, వలలు పంపిణీ



అమరగిరి చెంచులకు పుట్టీలు, వలలు అందజేస్తున్న ఆర్‌డీటీ సంస్థ సీవో రాములు

కొల్లాపూర్, ఫిబ్రవరి 27 : కొల్లాపూర్ మండల పరిధిలోని అమరగిరి గ్రామంలో నివాసం ఉంటున్న 40ఆదివాసి చెంచు కుటుంబాలకు ఐటీడీఏ మన్ననూర్ వారి సహకారంతో 25పుట్టీలు, చేపల వలలు మంగళవారం ఆర్‌డీటీ సంస్థ సీవో రాములు అందజేశారు. కృష్ణానది తీరంలో చేపలు పట్టుకుని జీవనం కొనసాగిస్తూ ఆర్థికంగా రాణించేలా వారికి తోడ్పాటు నందించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీటీ సంస్థ అధికారులు మహేష్, మాజీ ఉప సర్పంచ్ మల్లేష్, నిమ్మల శివ పాల్గొన్నారు.

కనుల పండువగా వెంకన్న బ్రహ్మోత్సవాలు



హంసవాహనంపై స్వామి ఊరేగింపు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 27 : మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి హంస వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతంగా అలంకరించి గ్రామంలోని వీధుల గుండా ఊరేగించారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు శేషాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ వి.సత్యం, ఉప సర్పంచ్ శ్రీనివాసులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కోటానాయక్

కల్వకుర్తి, ఫిబ్రవరి 27 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా యువజన అధికారి కోటానాయక్ కోరారు. కల్వకుర్తి మండలం తర్నికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద సేవా బృందం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లాక్‌స్థాయి క్రీడల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కోటానాయక్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యం చేకూరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్, హెచ్‌ఎం. రామకృష్ణ, ఉపాధ్యాయులు చెన్నకేశవులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

ఉప్పునుంతల, ఫిబ్రవరి 27: ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గువ్వలోనిపల్లి, పెనిమిళ్ల గ్రామాల్లో ఏపీవో సుదర్శన్‌గౌడ్‌తో కలిసి ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో పనులకు సంబంధించిన కూలిలు రాలేదని కూలీలు ఆయన దృష్టికి తీసుకవచ్చారు. ఎండలు తీవ్రత పెరగడంతో కూలీలు ఉదయం వెళ్లి పనులు ముగించుకునే విధంగా చూసుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా ఉపాధిహామీ పనులు చేస్తే ప్రదేశంలో మంచినీరు, మెడిసిన్‌కిట్లు, టెంట్లు వంటి మౌలిక వసతులు ఏర్పాట్లు చేయాలని ఏపీవోకు ఆయన సూచించారు. ఆయన వెంట టీఏ సింగోటం, కూలీలు తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి27: రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి రూ.500 రాయితీతో సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను వర్తింపజేయాలని సీపీఎం నాగర్‌కర్నూల్ మండల కార్యదర్శి జి.అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ మండల తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డులు జారీ చేయక పదేళ్లు పూర్తి కావస్తుందని, దీంతో వివాహాల అనంతరం ఉమ్మడి కుటుంబాల నుంచి వేరు పడిన కుటుంబాలు సంక్షేమ పథకాలకు దూరం అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం ఆలోచించి సబ్సిడీ సిలిండర్, ఉచిత కరెంటు పథకాలను రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబానికి వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, సుభాష్, సురేష్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కంకరతోనే సరి

- నిలిచిపోయిన తెలకపల్లి కల్వకుర్తి రోడ్డు పనులు

- ప్రయాణికుల అవస్థ



అసంపూర్తిగా మిగిలిపోయిన తెలకపల్లి, కల్వకుర్తి రోడ్డు పనులు

తెలకపల్లి, ఫిబ్రవరి 27 : ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న తెలకపల్లి నుంచి కల్వకుర్తి వరకు ఉన్న రోడ్డును డబుల్ రోడ్డు చేయాలని ఎదురు చూస్తున్న ప్రజలకు, ప్రయాణికులకు నిరాశ మిగిల్చింది. తెలకపల్లి శ్మశాన వాటిక నుంచి గౌరారం గేటు వరకు బీటీ రోడ్డు పూర్తైన మిగతా రోడ్డు అంతా కంకరమయంగా మారిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టర్ పనులు నిలిపివే యడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దాంతో వాహనదారులు దూరమైన మంతటి గడ్డ నుంచి కల్వకుర్తికి వెళ్తున్నారు. డబుల్ రోడ్డు పనులు ప్రారంభించనప్పుడు సంతోషపడ్డామని, కానీ మున్నాళ్ల ముచ్చటగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులు మళ్లీ ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. తెలకపల్లి, లింగాల, ఉప్పునుంతల, బల్మూరు తదితర మండల ప్రజలకు హైదరాబాద్ ఇక్కడి నుంచి దగ్గరవుతుంది. ఇలాంటి రహదారిని ఇన్నాళ్లుగా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న దుందుభి నదిపై బ్రిడ్జి నిర్మిస్తే రవాణా సౌకర్యం పెద్ద ఎత్తున మెరు గుపడే పరిస్థితి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి



ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన రోడ్డు సౌకర్యాలు పాలకులు పట్టించుకో కపోవడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నా తెలకపల్లి కల్వకుర్తి రోడ్డు పనులు ప్రారంభం కావడంతో ప్రజలు సంతోషించారన్నారు. అంతలోనే రోడ్డు పనులు ఆపేయడంతో వాహనదారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

- ప్రశాంత్, తెలకపల్లి

కోర్టు భవనాన్ని మంజూరు చేయాలి

- హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు



న్యాయమూర్తిని కలిసిన కల్వకుర్తి బార్ అసోసియేషన్ సభ్యులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 27 : కల్వకుర్తి పట్టణంలోని కోర్టు శిథిలావస్థకు చేరిందని నూతన భవన నిర్మాణానికి సహకరించాలని కల్వకుర్తి బార్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో హైకోర్టు న్యాయమూర్తి విజయసేన్‌రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కల్వకుర్తి కోర్టుకు నూతన భవన ఆవశ్యకతను వివరించారు. ఈ మధ్యలోనే జిల్లా నుంచి నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు వచ్చాయని త్వరలోనే నిర్మాణానికి అనుమతులు ఇస్తామని న్యాయమూర్తి తెలిపారని బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల వి.లక్ష్మణశర్మ, వెంకట్‌గౌడ్, కృష్ణయ్య, మల్లెపలి జగన్, వెంకటేశ్, నాగరాజు, లక్ష్మణ్‌రాజు, జయంత్‌కుమార్, రాంగోపాల్, ప్రశాంత్, సత్యం, శ్రీను, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికారాదు

-అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

- పాఠశాల పరిశీలన



ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి27: పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికారాదని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగా చేరుకోవాలని సూచించారు. పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పట్టణంలోని పాఠశాలలో నూతన భవనాల పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ఎంఈవో రామారావు, నాయకులు రాజేందర్, గౌరీశంకర్ నాయకులు పాల్గొన్నారు.

ఏటీఆర్ ఎఫ్‌డీవో మహబూబాబాద్‌కు బదిలీ

మన్ననూర్, ఫిబ్రవరి27: అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతం(ఏటీఆర్) ఎఫ్‌డీవో బత్తుల వాల్ బదిలీ అయినట్లు రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి నుంచి మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు అందాయి. ఏడాదిన్నరగా అమ్రాబాద్ ఎఫ్‌డీవోగా నిర్వహిస్తున్న విశాల్ ఐఎఫ్‌ఎస్ పదోన్నతిపై మహబూబాబాద్ డీఎఫ్‌వోగా బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం డీఎఫ్‌వో రోహిత్ గోపిడి ఐఎఫ్‌ఎస్ ఇన్‌చార్జి ఎఫ్‌డీవోగా విధులు నిర్వహిస్తున్నారు. కొత్త ఎఫ్‌డీవో ఇక్కడికి రావాల్సి ఉంది.

'డీఏలను వెంటనే ప్రకటించాలి'

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి27: ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డీఏలను వెంటనే ప్రకటించి పదోన్నతులు బదిలీలు వెంటనే చేపట్టాలని డెమోక్రటిక్ జిల్లా అధ్యక్షుడు జక్క రామస్వామి అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వృత్తి నిబద్ధతతో సామాజిక బాధ్యతను కర్తవ్యాలుగా చేసుకొని, కామన్ స్కూల్ విద్యావిధానం , శాస్త్రీయ విద్యావిధానం కోసం పని చేస్తున్న సంఘం డీటీఎఫ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలని, అందరికీ సమానమైన విద్య అందాలన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇస్తానన్న హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. సమావేశంలో డీటీఎఫ్ నాయకులు మోతిరామ్, భీమయ్య, నరసింహులు, జగదీష్, పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ర్యాలీ

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి27: ప్రతీ ఒక్కరు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహ కలిగి ఉండాలని లీడ్ బ్యాంక్ మేనేజరు కౌశల్‌కుమార్ పాండే అన్నారు. మంగళవారం లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జడ్పీ మైదానం నుంచి వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొని బస్టాండు మీదుగా అంబేడ్కర్ చౌరస్తా, నల్లవెల్లి రోడ్డు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందుగా ర్యాలీని కొనసాగించారు. కార్యక్రమంలో పశుసంవర్థకశాఖ అధికారి జీవీ. రమేష్, ఏపీజీవీబీ ఆర్‌ఎం రంజిత్, ఎస్‌బీఐ ఎండీఎం సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లలితాంబిక సోమేశ్వరాలయంలో కామారెడ్డి ఎమ్మెల్యే పూజలు

కొల్లాపూర్, ఫిబ్రవరి 27 : కొల్లాపూర్ మండలంలో పురాతన ప్రాచీన సోమేశ్వరాలయాన్ని మంగళవారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు పూర్ణకుంభంతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 27 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల కేజీఎస్ పూల దుకాణం దగ్గర క్షుద్ర పూజలు చేసినట్లు క్షుద్ర పూజల వస్తువుల ఉండడంతో పూల దుకాణ యాజమాని ఖాదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి బస్టాండ్ సమీపంలో ఉన్న కేజీఎస్ పూల దుకాణం దగ్గర క్షుద్ర పూజలు కోసం వినియోగించిన సామగ్రి షాపు ముందు పడి ఉండడంతో సోమవారం ఉదయం దుకాణం తెరిచేందుకు వచ్చిన దుకాణ సిబ్బంది వాటిని గుర్తించి యజమాని ఖాదర్‌కు సమాచారమందించారు. ఈ సంఘటనపై దుకాణయాజమాని ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్‌ఐని సన్మానించిన బీజేపీ నాయకులు

చారకొండ, ఫిబ్రవరి 27: నూతనంగా ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ రాజశేఖర్‌ను మంగళవారం బీజేపీ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్యగౌడ్, కిరణ్‌గౌడ్, ఆంజిగౌడ్, కన్న తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు శరీర దానం



నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాలలో అంగీకార పత్రాన్ని అందజేస్తున్న దాత ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి27: తమ మరణ అనంతరం పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు దానం చేసేందుకు ముందుకు వచ్చి ఓ యువకుడు స్ఫూర్తిగా నిలిచాడు. తాడూరు మండలం సిర్సవాడ గ్రామానికి చెందిన జల్లి ఉదయ్‌కుమార్ మంగళవారం నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహి తకు శరీరాన్ని డొనేషన్ అంగీకార పత్రాన్ని అందజేశాడు. ఉదయ్‌కుమార్ దాతృత్వం పట్ల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ సందర్భంగా దాత ఉదయ్‌కమార్ మాట్లాడుతూ తన మరణ అనంతరం కూడా తన శరీరం ఉపయోగపడాలన్నదే తన ధ్యేయమన్నారు. అందులో భాగంగా మరణానంతరం తన శరీరం వైద్య విద్య అభ్యాసిస్తున్న విద్యార్థులకు బోధనోపకరంగా ఉపయోగపడాలని ఈ నిర్ణయం తీసుకున్నాని తెలిపారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

చారకొండ, ఫిబ్రవరి 24: మండలంలోని నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ అన్నారు. మంగళవారం మండలంలోని గోకారం, చంద్రాయన్‌పల్లి, గైరాన్‌తండాల్లో నర్సరీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను ఎంపీవో వెంకటేష్‌తో కలిసి ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నర్సరీల్లో మొక్కలు త్వరగా పెరిగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇంటి పన్నులు నూరుశాతం వసులు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీవో వెంట పంచాయతీ కార్యదర్శులు చెన్నకేశవులు, రాజు, శ్రీఫణి, ఫీల్డ్ అసిస్టెంట్లు కృష్ణయ్య శ్రీను వున్నారు.

కొత్తగా 12 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

ఉప్పునుంతల, ఫిబ్రవరి 27 : మండలంలో కొత్తగా ఏర్పడిన చిన్న గ్రామపంచాయతీలలో 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని సూర్యతండా, సీబీతండా, పిర్వాటోనిపల్లితండా కంసానిపల్లితండా, దేవదారికుంటతండా, గుట్టమీదితండా, పూర్యాతండా, తిప్పాపూర్, తిప్పాపూర్ తండా గ్రామాలతో పాటు పలు గ్రామాల్లోనూ నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవనాలను పరిశీలించి వసతులపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిచన్నుట్లు ఆయన తెలిపారు. స్థానికంగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అడవిజంతువు దాడిలో ఆవు దూడ మృతి

వెల్దండ, ఫిబ్రవరి 27 : అడవిజంతువు దాడి చేయడంతో ఆవుదూడ మృతి చెందింది. ఈ ఘటన మండలకేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వెల్దండకు చెందిన గంటల లక్ష్మయ్య అనే రైతు తన పశువులను పొలం వద్ద కట్టివేసి ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా గుర్తుతెలియని అడవిజంతువు దాడిచేయడంతో ఆవుదూడ మృతి చెందినట్లు గుర్తించి అటవీశాఖ అధికారులకు, పశువైద్యాధికారులకు సమాచారం అందించాడు. అటవీశాఖ అధికారులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతిచెందిన దూడను, దాడిచేసిన జంతువు పాదముద్రలను పరిశీలించారు.

క్రూయిజర్ బోల్తా-డ్రైవర్‌కు గాయాలు

వంగూరు, ఫిబ్రవరి 27: మండలంలోని హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిలో ఆరే మైసమ్మ ఆలయ సమీపంలో క్రూయిజర్ వాహనం బోల్తాపడటంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్లితే తలకొండపల్లికి చెందిన వీరేష్ డిండి నుంచి కల్వకుర్తికి వాహనాన్ని డ్రైవింగ్ చేసుకుంటూ వస్తుండగా మార్గమధ్యలో వంగూరు గేటు దాటిన తర్వాత ఆరే మైశమ్మ ఆలయ సమీపంలో క్రూజర్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వీరేష్‌కు బలమైన గాయాలు తగిలి గాయపడ్డాడు. వెంటనే బాధితుని 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత - కేసు నమోదు

తాడూరు, ఫిబ్రవరి 27 : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల వసతి గృహం వద్ద రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం... తాడూరు గ్రామానికి చెందిన కొమురయ్య చుట్టు పక్కల గ్రామాలల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి తన ఆటోలో నాగర్‌కర్నూల్‌కు తరలిస్తున్నారనే సమాచారం రావడంతో సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి తాడూరు కేజీబీవీ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు క్వింటాళ్ల బియ్యం పట్టుబడింది. దీంతో సివిల్ సప్లయ్ డీటీ నరసింగరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వచ్చేనెల 2 నుంచి శివస్వాములకు అన్నదాన శిబిరం

మన్ననూర్, ఫిబ్రవరి27: పాదయాత్రగా శ్రీశైలం వెళ్లే శివస్వాములకు మార్చి 2 నుంచి 5 వరకు అన్నదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నారాయణపేట జిల్లా మాగనూరు మండలం గూడెబల్లూరు గ్రామానికి చెందిన శివభక్త బృందం గురుస్వామి శివ గుండప్ప తెలిపారు. 20ఏళ్లుగా శివ స్వాములకు మన్ననూరులో అన్నదానం చేస్తున్నామన్నారు.

రేషన్‌కార్డుల ఈకేవైసీ తప్పనిసరి

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 27 : రేషన్‌కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని రేషన్‌షాపు డీలర్లు జి.రామకృష్ణ, జూంపాల్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో మండల కేంద్రంలో వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈనెల చివరిలోగా ఈకేవైసీ చేయించుకోవాలని లేదంటే మార్చి నెలలో ఇచ్చే రేషన్ సరుకులు రావన్నారు. ప్రభుత్వం అందించే పథకాలకు రాబోయే రోజుల్లో రేషన్ కార్డు కీలకమని సమీపంలోని రేషన్ డీలర్‌ను సంప్రదించి ఈకేవైసీ చేసుకోవాలన్నారు.

గడువు పొడిగించాలి

- బీఎంపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్

తాడూరు, ఫిబ్రవరి 27 : రేషన్‌షాపులో ఈకేవైసీ గడువు పొడిగించాలని బీఎంపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం విజయ్ కోరారు. తాడూరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 29వరకు మాత్రమే రేషన్‌షాపులో ఈకేవైసీ చేయించుకునేందుకు గడువు ఇవ్వడంతో చాలా మంది చిన్న పిల్లలకు వేలి ముద్రలు అప్‌డేట్ కావడం లేదన్నారు. మండల కేందంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ దగ్గరకు వెళ్తే అక్కడ ఒకే సెంటర్ ఉండడం, ఎప్పుడు రద్దీగా ఉండడం వలన చాలా మంది పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రజలకు సరైన అవగాహన కల్పించే చర్యలు ప్రభుత్వం తీసుకుని అందరు అప్‌లోడ్ చేయించుకోవడానికి రెండు నెలల గడువు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ మండల నాయకులు జెట్టి చంద్రయ్య, వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- బీఎస్పీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కల్యాణ్

తెలకపల్లి, ఫిబ్రవరి 27 : భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని బీఎస్పీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కల్యాణ్ అన్నారు. బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తెలకపల్లి మండల కేంద్రంలో నెహ్రూచౌరస్తాలో భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందామనే నినాదంతో బీఎస్పీ నాయకులు వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి రామచందర్, మండల అధ్యక్షుడు ఆర్‌కే.శివశంకర్, ప్రధాన కార్యదర్శి బాలనాగయ్య, టౌన్ అధ్యక్షుడు గుగ్గిల రాజేష్, భారీగారి శ్రీకాంత్, బాలకృష్ణ, శశికుమార్, భానుప్రసాద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

ఊర్కొండ, ఫిబ్రవరి 27: మండల పరిధిలోని ఊర్కొండ, ఊర్కొండపేట, మాదారం జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను మంగళవారం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పంపిణీ చేశారు. విద్యార్థులు ఇష్టపడి చదివి తాను అనుకున్న గమ్యాన్ని చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఎండీ కైసర్, నాయకులు మాసుం, అమ్ము, ఆరిఫ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసులు, మనోహర్‌రెడ్డి, షైబాజోద్దీన్, మన్సూర్, జంగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రవణ్‌కుమార్, బాలయ్య, ఉపాధ్యాయులు యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఊర్కొండ, ఫిబ్రవరి 27: మండలంలోని ఊర్కొండపేట గ్రామంలో మంగళవారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 30 లక్షలు మంజూరు చేసిన స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసులు, నర్సిరెడ్డి, మనోహర్‌రెడ్డి అషు, షైబా జోద్దిన్, రవీందర్‌గౌడ్, జంగారెడ్డి, అంజయ్యగౌడ్, రవీందర్, చంద్రయ్య, మల్లేష్, మన్సూర్, అశోక్, కైసర్, శ్రీశైలం, ప్రవీణ్‌రెడ్డి తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బల్మూర్, ఫిబ్రవరి 27 : అభివృద్ధి పనులను చేసుకోవడంలో ప్రజలు సహకరించాలని ప్రత్యేక అధికారి, తహసీల్దార్ శైలేంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామంలో పదిలక్షల రూపాయలతో చేస్తున్న సీసీ రోడ్ల పనులను ఆయన శంకుస్థాపన చేశారు. అంతకు ముందు గ్రామపంచాయతీలో ఆయన ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. గ్రామ ప్రజలు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి జోష్నారాణితోపాటు గ్రామ పెద్దలు శంకర్‌నాయక్, కృష్ణానాయక్, బాలు, శివతోపాటు టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి: ఏఈ

కోడేరు, ఫిబ్రవరి 27 : విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఏఈ రాకేష్, లైన్‌మెన్ ప్రభాకర్ సంయుక్తంగా ఒక ప్రకటనలో మంగళవారం వినియోగదారులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి ఉచిత విద్యుత్ పొందాలంటే పెండింగ్ బిల్లులు ఉండరాదని అన్నారు. పాత బకాయిలు ఉంటే ఈ పథకానికి అర్హులు కారన్నారు. ఈ నెల 29 వరకు బకాయిలు పూర్తిగా చెల్లించాలని వినియోగదారులకు తెలియజేశామన్నారు.

అధికారిక విద్యుత్ కోతలు లేవు: ఏడీఈ

కల్వకుర్తి, ఫిబ్రవరి 27 : కల్వకుర్తి సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి విద్యుత్ కోతలు లేవని ఏఈడీ చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాపై కొంతమంది తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దీనిని నమ్మవద్దని ఆయన పేర్కొన్నారు. గృహావసరాలతోపాటు వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా విద్యుత్‌సరఫరా చేస్తున్నామని ఏడీఈ పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలకు బ్యాటరీ ఇన్వర్టర్ వితరణ



ఇన్వర్టర్‌ను అందజేసిన మిత్ర ఫౌండేషన్ సభ్యులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 27 : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలకు మిత్ర ఫౌండేషన్ సభ్యులు బ్యాటరీ, ఇన్వర్టర్‌ను మంగళవారం అందించారు. కార్యక్రమంలో కళాశాలలో ప్రిన్సి పాల్ శర్వాణీ, మిత్ర ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఎంపిక

మన్ననూర్, ఫిబ్రవరి27: గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన కందికొండ శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య మహాసభ రీజినల్ చైర్మన్ జూలూరి సత్యనారాయణ, నాయకులు సంభు వెంకట్‌రమణ, బిల్లకంటి రమేష్, కందికొండ శివశంకర్, భాస్కర్, సంబు శ్రీనివాసులు, నీలకుమార్ హర్షం వ్యక్తం చేశారు.

నేడు పునఃప్రారంభించనున్న పాఠశాల భవనం

తాడూరు, ఫిబ్రవరి 27 : మండలంలోని సిర్సవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పునఃప్రారంభించనున్నట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎండి.చాంద్‌పాషా మంగళవారం తెలిపారు. గతంలో ప్రోటోకాల్ విషయంలో వివాదాస్పదం కావడంతో జిల్లా విద్యాధికారి గోవిందరాజులు ఆనాటి ప్రారంభోత్సవాన్ని రద్దు చేశారు. దీంతో మళ్లీ బుధవారం ఉదయం ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.